నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 3 అక్టోబర్ 2024 | HYDERABAD



గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

-సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ)



**ఎంగిలిపూల సంబురం** బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా మొదలయ్యాయి. ఉయ్యాల పాటలతో నగరం మార్మోగింది. కూకట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



**మహనీయులకు నివాళి** బుధవారం తెలంగాణ భవన్‌లో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన మూసీ వెంట కూల్చివేతకు వ్యతిరేకంగా కొత్తపేట డివిజన్‌లోని న్యూమారుతీనగర్ నార్త్ కాలనీ నిర్వాసితులు వినూత్నంగా నిరసన తెలిపారు. సర్కారు దృష్టి తమ ఇండ్లపై పడకుండా బుధవారం రాత్రి ఎరుపు నీళ్లతో తమ గృహాలకు సామూహిక దిష్టి తీశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌కు తమ ఇండ్లపై దృష్టి తొలగిపోయి.. మనసు మారాలని కోరుకున్నారు.

-హయత్‌నగర్




# దూసుకొస్తున్న జేసీబీలు!

## శిథిలాల తొలగింపునకు సర్కారు రెడీ

### మూసీ పరీవాహక కాలనీల్లో భయం.. భయం



- ప్రజలు అడ్డుకోకుండా.. రహస్య దారుల అన్వేషణ
- రెడ్ మార్క్‌కు నిరాకరించిన ఇండ్లపై అధికారుల కన్ను
- మిగిలిన నిర్మాణాలు కూల్చే ప్రణాళికలు
- అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్న నిర్వాసితులు
- మళ్లీ ఉద్రిక్తత తలెత్తే అవకాశం

*మూసీ రణరంగాన్ని తలపిస్తున్నది. ఎప్పుడు ఏమవుతుందోనన్న టెన్షన్ నెలకొంది. ఏండ్ల తరబడి అక్కడ బతుకుతున్న వారి ఇండ్లను కూల్చేసి రేవంత్ సర్కార్ దమనకాండకు తెరతీసింది. ఇప్పటికే 150 ఇండ్లు నేలమట్టమయ్యాయి. మరో 940 గృహాలపై రెడ్ మార్క్ వేలాడుతున్నది. ఎటు నుంచి జేసీబీలు, బుల్డోజర్లు వస్తాయోనని నిర్వాసితులు బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు అధికారులు కూల్చేసిన గృహాల శిథిలాలను తరలించాల్సి ఉన్నది. అందుకోసం జేసీబీలను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారు. నేడు అవి హిమాయత్‌నగర్, సైదాబాద్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోకి దూసుకొచ్చేందుకు సిద్ధమయ్యాయి. అయితే హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన నిర్మాణాల వరకు జేసీబీలు వెళ్లే రోడ్లు లేవు. ఇరుకు రహదారులతో ఆ ప్రాంతాలు ఉన్నాయి. రెడ్ మార్క్ నిరాకరించిన ఇండ్లను సైతం కూలగొట్టినా.. జేసీబీలు అక్కడి వరకు వెళ్లలేని పరిస్థితి. ఒకవేళ ఎంట్రీ ఇచ్చినా.. అడ్డుకునేందుకు నిర్వాసితులు సిద్ధమవుతుండటంతో పరీవాహక ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్తత పరిస్థితి తలెత్తే అవకాశమున్నది. అయితే అలాంటి పరిస్థితి ఎదురైతే ఏం చేయాలన్న అంశంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రజల కంట పడకుండా జేసీబీలను అక్కడికి తరలించేందుకు రహస్యదారులను అన్వేషించినట్టు సమాచారం.*

-సిటీబ్యూరో



తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందు గోడు వెల్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు

### రహస్య దారుల పరిశీలన

హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన నిర్మాణాల శిథిలాలు తరలించేందుకు అధికారులు రహస్యదారులను పరిశీలిస్తున్నారు. జేసీబీలను ప్రజలు అడ్డుకోకుండా త్వరగా శిథిల ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళికలు వేస్తున్నారు. అందుకోసం మూడు మార్గాలను అధికారులు ఎంచుకున్నట్టు తెలిసింది. అందులో భాగంగా ఎంజీ బస్టాండ్ నుంచి 1/2 కిలోమీటర్ మూసీ మార్గాన్ని పరిశీలించినట్టు తెలిసింది. మరో మార్గం పురానాపూల్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరంతో మూసీ వెంట రూట్‌ను కూడా పరిశీలించినట్లు సమాచారం. మూసారంబాగ్ నుంచి అంబర్‌పేట బ్రిడ్జి మీదుగా సదరు లొకేషన్‌కు చేరుకునే మార్గాన్ని కూడా చర్చించుకున్నట్టు తెలిసింది. ఈ మార్గాలపై రెవెన్యూ అధికారులు, పోలీసులు చర్చలు జరిపినట్టు సమాచారం.



### జేసీబీ ప్రవేశిస్తే..

మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలు 50 మంది లేబర్లతో జరిగాయి. 150 నిర్మాణాలు భూస్థాపితమయ్యాయి. ఆ శిథిలాలను తరలించాలనే నెపంతో జేసీబీలను అధిక సంఖ్యలో అక్కడికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కసారి అవి అక్కడికి వెళితే శిథిలాల తొలగింపుతో పాటు రెడ్ మార్క్ చేసిన ఇతర నిర్మాణాలను సైతం కూల్చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. అయితే ఇది అక్కడి పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే కొందరిని ఒప్పించి డబుల్ బెడ్రూం అందించడానికి నిర్ణయించామని.. వారి అంగీకారంతో మిగిలిన నిర్మాణాలు కూల్చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు తమ ఇండ్లను బలవంతంగా, బెదిరిస్తూ కూల్చేస్తున్నారని నిర్వాసితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసుల బెదిరింపులతో ఖాళీ చేయాల్సిన దుస్థితి వస్తున్నదని రమ్య, ఫాతిమా అనే మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

### కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్

మేడ్చల్ కలెక్టరేట్: మూసీ నిర్వాసితుల వినతులు స్వీకరణకు మేడ్చల్ కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెక్షన్‌లో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతం తెలిపారు. బాధితులు నేరుగా లేదా, కార్యాలయ పనివేళల్లో 9492409781 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



### సీఎం రేవంత్‌కు మనసు లేదు

మాకు ఇక్కడి నుంచి వెళ్లాలని లేదు. మా ఇల్లును కూల్చేశారు. మమ్మల్నీ బెదిరించి కూల్చారు. మా బతుకును నాశనం చేశారు. రేవంత్ సర్కార్‌కు మా కన్నీటి గోస తగులుతుంది. మేం అనుభవిస్తున్న కష్టానికి వంద రెట్లు అధికంగా గోసపడాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి మనసులేని సీఎం ను మేం ఏనాడూ చూడలేదు. కుటుంబ సభ్యులందరం చిన్నాభిన్నమయ్యాం. -ఫాతిమా, మూసానగర్.



### మీరేం బాగుపడుతారు..

మూసీలో ఏండ్ల తరబడి ఉంటున్నాం. మా ఇండ్లను కూల్చితే మీకేం వస్తుంది. మా బతుకులు నాశనం చేసి కట్టే భవంతులు, నిర్మాణాలు మీకు మేలు చేయవు. మేము ఇష్టపూర్వకంగా వెళుతున్నామని అధికారులు చెబుతున్నారు. అది అబద్ధం. మమ్మల్ని బెదిరించి పంపడానికి చూస్తున్నారు. నిర్మాణాలు కూల్చడానికి ఏ మిషన్లు వచ్చినా.. అడ్డుకుంటాం. మా ఇండ్లు కూల్చి మీరేం బాగుపడుతారు. -చాంద్‌బీ, శంకర్‌నగర్.

## పారిశుధ్య కార్మికుల జీతంలో కోత

### అసలే తక్కువ వేతనం.. ఆపై ఔట్‌సోర్సింగ్

- సమ్మతి లేకుండానే బల్దియా ఏకపక్ష నిర్ణయం
- రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సాలరీలో కట్
- ఖమ్మం వరద బాధితుల సహాయమంటున్న అధికారులు
- జీహెచ్ఎంసీ నిర్ణయంపై కార్మికుల మండిపాటు

సిటీబ్యూరో: అసలే తక్కువ జీతం.. ఆపై ఔట్‌సోర్సింగ్.. వెరసి రోడ్లు ఊడ్చే పారిశుధ్య కార్మికుల ఒకరోజు జీతానికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కోత పెట్టింది బల్దియా. వరద బాధితుల సహాయం కోసమే కోత పెట్టినట్లు అధికారులు చెబుతుండగా, సమ్మతి లేకుండానే ఈ నిర్ణయం తీసుకోవడంపై కార్మికులు మండిపడుతున్నారు. బల్దియాలో 22,019 మందికి పైగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. నెలకు జీతం రూ. 18వేలు.. ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లు కట్ చేశాక వారి చేతికి వస్తున్నది రూ. 14వేలు మాత్రమే. ఆ మొత్తంతో కుటుంబ భారం మోస్తున్న పారిశుధ్య కార్మికులపై ఒక్కసారిగా బల్దియా భారం మోపింది. వారు తీసుకున్న నెలవారీ జీతంలో ఒక్క రోజు వేతనాన్ని కోత పెట్టింది. కనీసం కార్మికులకు ఒక మాట చెప్పకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఖమ్మం వరద బాధితుల సహాయార్థం పేరిట బల్దియా ఉద్యోగులంతా ఒక్కరోజు వేతనం చెల్లిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే లక్షలు జీతాలు తీసుకునే వారి నుంచి ఒక్క రోజు వేతనం కట్ చేస్తే వారికి వచ్చే నష్టమేమీ లేదు. ఇక్కడ పారిశుధ్య కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులు కాదు..ఆపై ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే వారు. చిన్న జీతాలు తీసుకునే వారని చూడకుండా ముందస్తుగా ఒక్క మాట చెప్పకుండా ఒక్కో కార్మికుడి నుంచి రూ.600 మేర ఒక్కరోజు వేతనాన్ని కట్ చేశారు. కార్యక్రమం మంచి ఉద్దేశమే అయినా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాన్ని జత కట్టడం, ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

### ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి: మంత్రి పొన్నం

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షపు నీటిని వృథా చేయవద్దని, ప్రతి నీటి చుక్కను భూగర్భ జలంగా మార్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గ్రేటర్‌లో సీవరేజీ ఓవర్‌ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మెహిదీపట్నంలోని బాపూఘాట్ వద్ద గాంధీకి నివాళులర్పించిన అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు సరోజినీదేవి ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, భవిష్యత్‌లో నీటి కరువు రాకుండా ఖాళీ ప్రదేశాల్లో వీటిని నిర్మించుకోవాలని సూచించారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోళ్లలో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగకుండా వాటిల్లో ఎలాంటి వ్యర్థాలు వేయొద్దని కోరారు. నగరాన్ని సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వివరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ డ్రైవ్ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఈడీ మాయంక్ మిట్టల్, డైరెక్టర్లు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.





ఇంకుడుగుంత నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



## మెట్రో సాధనకు ఉద్యమం

- మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆందోళన
- 6న సుచిత్రలో మహాధర్నాకు పిలుపు

సిటీబ్యూరో: మెట్రో రైలు కారిడార్‌ను సాధించడమే లక్ష్యంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి కార్యాచరణ సిద్ధం చేసింది. జనమే లేని, భవిష్యత్‌లో వస్తుందో రాదో తెలియని ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ) కోసం 40 కి.మీ మెట్రో మార్గాన్ని రెండో దశ మెట్రో ప్రాజెక్టులో చేర్చారు. అయితే లక్షలాది మంది నివాసముంటున్న ఉత్తర హైదరాబాద్ వైపు మెట్రో మార్గం నిర్మించకపోవడంపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఉద్యమానికి తెరలేపింది. ఈనెల 6న సుచిత్ర ప్రాంతంలో మహాధర్నాకు పిలుపునిచ్చింది. ప్యారడైజ్ నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారి మీదుగా మేడ్చల్ వరకు, సికింద్రాబాద్ ప్యాట్నీ నుంచి అల్వాల్, తూంకుంట మీదుగా శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు మెట్రో రైలు కారిడార్లను ఏర్పాటు చేస్తామని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసి, సర్వే పనులు చేపట్టింది. అయితే కాంగ్రెస్ సర్కారు ఆ ప్రతిపాదించిన మెట్రో మార్గాలను రద్దు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి తాను అనుకున్న ప్రాంతాలకే కొత్తగా మెట్రో కారిడార్లను ప్రతిపాదించడంతో పాటు వాటికే డీపీఆర్‌లను రూపొందించేలా ఆదేశించారు. ఈ క్రమంలోనే ఉత్తర హైదరాబాద్ ప్రాంత వాసులు ఏకమై మేడ్చల్ మెట్రో సాధన సమితిగా ఏర్పాటై 'మా ప్రాంతాలకు మెట్రో కావాలం'టూ డిమాండ్ చేస్తున్నారు.

### ఉత్తర హైదరాబాద్‌ను విస్మరించారు

'నిత్యం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే ఉత్తర హైదరాబాద్ ప్రాంతాలను విస్మరించడం ఆమోదయోగ్యం కాదు' అని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తర హైదరాబాద్ వైపు ఉన్న నాగ్‌పూర్ జాతీయ రహదారి, హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిపై ప్రతిపాదించిన మెట్రో మార్గాలను రెండోదశ ప్రాజెక్టులోనే చేర్చాలంటూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సైతం డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిని కలిసి మెట్రో మార్గం ఏర్పాటుపై చర్చించారు.

## హెచ్ఎండీఏ పార్కుల్లో మౌలిక వసతులు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉన్న పార్కుల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట స్థలాల ఆధునీకరణ, బ్యూటిఫికేషన్ పనులను చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సరూర్‌నగర్‌లోని ప్రియదర్శిని పార్కులో ప్రవేశ మార్గంలో రెయిలింగ్‌తో పాటు, వాకింగ్ ట్రాక్, మరుగుదొడ్లకు మరమ్మతులతో పాటు ఓపెన్ జిమ్ పరికరాలు, ఎస్‌బీఆర్ ఫ్లోరింగ్‌తో ఆధునీకరించనున్నారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయనున్నారు. నారాయణగూడలోని డా. జీఎస్ మేల్కోటీ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేయనుండగా, పాత్ వే, స్కేటింగ్ ఏరియా ఫ్లోరింగ్, పార్కింగ్, సీటింగ్ ప్రాంతాలకు వెళ్లేందుకు అదనపు గేట్లను అమర్చనున్నారు. దాదాపు కోటి అంచనా వ్యయంతో పార్కుల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు హెచ్ఎండీఏ వర్గాలు వెల్లడించాయి.




బతుకమ్మ వేడుకలపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చూపుతున్నదనడానికి ఈ చిత్రమే ఉదాహరణ. బుధవారం కూకట్‌పల్లిలో మొదటి రోజు ఆడబిడ్డలంతా తీరొక్కపూలతో ఎంగిలిపూల బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఐడీఎల్ చెరువు సమీపంలో ఉన్న కొలను వద్దకు రాగా, అందులో నీళ్లు లేకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.